నవీన్ సీత మొహంలోకి సూటిగా చూశాడు. అందమైన పెదాల్ని లిప్‌స్టిక్‌తో పాడు చేసుకుంది అనుకున్నాడు.

శ్రీశ్రీ సంగతి అడిగేడు. జాతిని మేల్కొల్పిన నవయుగ వైతాళికుడు కదా అన్నాడు. 'వూ' అని వూరకుంది సీత. సాహిత్యంమీద శ్రద్ధలేదు కాబోలు అనుకున్నాడు నవీన్. కాశీ పట్నం తెలుసా? అనడిగేడు. వెళ్ళలేదు అంది సీత!

'డాడీ అంతా కల్పితమైన వాతావరణం. తెలుగుతనం లేనేలేదు. మనం అంతదూరం దేన్ని ఆశించి పల్లెటూరి సమ్మంధం అని ఆశించి వచ్చేమో అది వీళ్ళ దగ్గర మచ్చుకైనా లేదు. విదేశీ వ్యామోహంలో వున్నారే గాని తెలుగు సంప్రదాయాన్ని మర్చిపోయేరు' నవీన్ డాడీతో గుసగుసలాడ్డం మధ్యవర్తిగా వున్న వరహాలావు విన్నాడు. గోడలకు చెవులుంటాయి మరి! విని వూరుకోలేదు.

వారంరోజుల్లో వరహాలావిల్లు 'గృహమే స్వర్గసీమ'లా తయారైంది. వర్ధనమ్మ 'ఇంటికి దీపం ఇల్లాలే'లా తీర్చిదిద్దబడింది. 'బాపు బొమ్మలా' వసంత తయారైంది. వందకు పైచిలుకు విదేశీ పాప్ మ్యూజిక్ క్యాసెట్లతో సతమతమౌతున్న క్యాసెట్టు స్టాండులో నల్లకాకిలా అప్పుడెప్పుడో మద్రాసులో కొన్న మంగళప్రదమైన 'సన్నాయివాద్యం' క్యాసట్టు వుంది. అది టేప్‌రికార్డరులో మెలమెల్లగా తిరిగి ధ్వనించింది.' వరహాలావు కోరిన మీదట పెళ్ళి చూపులు జరిగేయి. జీన్స్‌లో తిరిగే వసంత కంచిపట్టు చీరలో మెరిసిపోతోంది. విదేశీ మద్యాల్లో బతికే వరహాలావు వూరవేసిన వుసిరి కాయలు నమిలేడు

పెళ్ళిచూపులు జరిగేయి. 'ఏ సంగతీ వెళ్ళి వుత్తరం రాస్తాం' అని నాన్చకుండా 'ముహూర్తాలు నిర్ణయించండి' అని నవీన్ కుండబద్దలుకొట్టి నట్టు చెప్పేడు. వసంత అతని గుండెల్లో గూడు కట్టుకుంది.

* * * *

గతుకుల రోడ్డుమీద గతి తప్పకుండా పోస్టు మేన్ వచ్చి మురళికి కవరందించేడు. అది విదేశీ స్టాంపులగల కవరుకాదు. అలా అని ఆ స్వదేశీ స్టాంపులు మురళి ఆల్బమ్‌లో లేవు. లేకపోయినా ఆ కవరుని తల్లిమీదకు గిరాటేసి ఆడుకుందికి పారిపోయేడు మురళి.

'మీ సంబంధం చేసుకోలేకపోతున్నందుకు విచారిస్తున్నాం— నవీన్. రిగ్రెట్ కార్డు చదివిన నిరుద్యోగిలా ఫీలయ్యేరు కుటుంబరావుగారు. వాళ్ళకి ఎందుకు నచ్చలేదో అంతుపట్టలేదు. జవాబులన్నీ చెప్పినా సెలెక్టుకాని నిరుద్యోగిలా వుంది అతని పరిస్థితి. కుటుంబరావుగారి భార్య రాజేశ్వరమ్మగారు' 'అక్కడ వాడికెవత్తో వుందిట! ఇంకానయం తెలీక పడిపోయాంకాదు' అని వూరంతా టాంటాం కొట్టింది.

పెద్దపల్లి సంతోషించింది సంబంధం తప్పి పోయినందుకు. వసంతకి ఆనందంగా వుంది అమెరికా పోతున్నందుకు. నవీన్‌కి తృప్తిగావుంది తెలుగుపిల్లని పరిణయమాడినందుకు. సీతకి ఆనందంగా వుంది అమెరికాలో వున్నా తెలుగు ప్రశ్నలడిగిన మొగుడు రానందుకు. వరహాలావుకి ఆనందంగా వుంది ట్రిక్‌ప్లే చేసినందుకు.

కుటుంబరావుగారికీ, నవీన్‌కీ, నవీన్ డాడీకి. వసంతకీ, సీతకీ తమతమ మనసుల 'గతి' తెలుసో తెలీదో మరి!! కాలచక్రం మాత్రం నిరంతరం గతి తప్పని కక్ష్యలో తిరుగుతోంది.

